


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

# -140-

(21 ' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**నిద్రాదేవత వడిలో** పరుండి మధుర స్వప్నాలు కంటున్న జీవి కళ్ళు తెరిచి తిరిగి ఈ ప్రపంచంలో అడుగుపెట్టడం, కష్టభూయిష్టమైన కార్యక్రమాలలో పాల్గొనడం అనాదిగా వస్తున్న ఆచారమే.

మానవజాతి ప్రథమ దశలో ఎలాటి భోగాలు లేకపోయినా, ప్రకృతిచ్చాయలలో హాయిగా నిద్రపోతూ వుండేవారు. సూర్యభగవానుడు వచ్చి కళ్ళల్లో పొడిస్తేగానీ లేచేవారు కాదుట. అంతేకాని పిట్టలు వినిపించే కిచకిచలు, ప్రత్యూష ప్రకృతి ఆలపించే మూగరాగాలూ వారికి వినిపించేవి కాదుట. అందువల్ల సప్తాశ్వుడే వారికి వైతాళిక గీతాలు వినిపించేవాడుట.

కొందరు అప్పటికే నిద్రనుంచి లేవడానికి సందేహించేవారుట. అప్పుడు ఆకలి దేవత వచ్చి వారిని హెచ్చరించి లేపి "పిచ్చి మానవుడా ఎంతసేపలా నిద్రపోతావు? భుక్తి కోసం వెతుక్కో అక్కర్లా? వెలుగులో కడుపు విషయం ఆలోచించుకో, చీకట్లో వెన్నెల్లో సుఖసుషుప్తిలో మునిగి సేద తీర్చుకో" అని హెచ్చరించేదిట.

ఈ రోజుల్లో దినచర్యలు వేరు. ఆది యుగంలో కార్యక్రమాలు వేరు. ఈ కాలంలో నిద్రలేచినప్పటినుంచీ ఆఫీసులకు వెళ్ళడమో, వ్యాపారానికి బయలుదేరడమో, రెండూ లేనివాడు ఎవర్ని మోసం చేద్దామా? ఎలా డబ్బు జేబులో వేసుకుందామా? అని మోసపు షికార్లకు బయలుదేరడమో జరుగుతూ వుంటుంది.

ఈ ఆలోచనలకు వుండే బరువు ఈ ఆలోచనలకూ వుంది. కొన్ని కొన్ని సందర్భాలలో మెదడు బ్రెడింగ్ శాఖలో మైదాపిండి వుడికినట్లు వుడుకుతుంది. కొన్ని కొన్ని సందర్భాలలో అర్థం లేని ఆలోచనలు చెయ్యడంవల్ల మెదడు చుక్కలా ఉడికి మాడిపోవడం కూడా కద్దు. నిద్రలేవడమే ఈ ఉడుకుడుకు ప్రారంభం. అందువల్ల కూడా ప్రాణి నిద్రలేవడానికి ఎంతో బాధపడుతూ వుంటాడు పాపం.

ఆది యుగంలో మానవుడు మేల్కొనగానే తన దినచర్యను గురించి దిగులు చెందుతూనే వుండేవాడట. అతడికి నిల్వ ఆహారాలు లేవు. నిత్యజీవితంలో బదుళ్ళుగా, బహుమానాలుగా అందుకుని అనుభవించేందుకేమీ వుండేవి కావు. నిద్రలేచినప్పటి నుంచీ క్రూరమృగాలతో వేటాడాలి. ఇంత ఆహారం సంపాదించుకోవాలి. ఇదే నిత్యకృత్యమే కావచ్చు. కానీ దీనిలో ఎంతో కనిపించని భయం దాగివుంటుంది.

కొందరిళ్ళల్లో ప్రొద్దెక్కేదాకా నిద్రలేవని వాళ్ళను చూచి అంటూ వుంటారు. "నిద్రలేవడానికి అలా వణికిపోతావేం. మంచం చుట్టూ పులులేం వచ్చి నుంచోలా. గడప దగ్గరేం ఖడ్గమృగం కాచుకుని లేదు మీద పడిపోవడానికి" అని.

అసలు మృగాలు వుండక పోవచ్చుగాని కొన్ని ఇళ్ళల్లో ఆ రూపాల్లో కాకపోయినా, అంతకు మించిన క్రూరత్వాన్ని కూడగట్టుకుని అత్తలూ, ఆడపడుచులూ కాచుకుని వుండటం మాత్రం నిజం.

పూర్వకాలంలోవాళ్ళు గుళ్ళో సన్నాయిపాట వినిపిస్తేనో, ప్రక్కింటి ముసలితాత దగ్గుతూ ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు ప్రారంభించినప్పుడో. బుడబుక్కలవాడొచ్చి వెళ్ళగానే, నిద్రలేచి చల్లచేసుకోవడం ప్రారంభించేవారు.

ఈ రోజుల్లో అలాటి మేల్కొల్పులన్నీ పోయాయి. పాలమనిషి కేకవేస్తేగానీ అసలు తెల్లారిందని తెలియదు చాలామందికి. అందులో కాఫీ బెంగజీవులు పాలకేక వినబడగానే "అవిగో పాలు వచ్చాయి" అని అదిరిపడి లేస్తారు. అలాటివారితో భార్యలంటూవుంటారు "రోజూ వచ్చే పాలనీళ్ళకు అంత కేక పెట్టిలేస్తారెందుకండీ? బాంబు పడ్డంత హడావిడి దేనికి? నే వెళ్ళి పోయించుకొస్తాగా" అని.

"కలతనిద్రలో పాలకేక ఏదో గొప్ప హెచ్చరికలాగా వినిపిస్తుందే అసలు ఆ కేకతో పంచప్రాణాలూ లేచి వస్తాయి" అని ఆయనగారు సమాధానం చెప్పుకుంటారు.

"పోనీ కొంచెం ముందుగా లేవకూడదా? కొంచె ఆలస్యంగా లేవకూడదా. అప్పుడు ఈ కేకలు తప్పేవిగా" అని ఆవిడ సలహా.

"పాలకేక వినందే లేవబుద్ధి పుట్టదే విజయలక్ష్మీ. ఆ పిలుపులో అంత మహాత్మ్యం వుంది" అని ఆయనగారి సకిలింపు.

"అవును మరి. ప్రతిరోజూ కాఫీ కప్పుల్లో మొఖాలు చూసుకునే స్థితికి వచ్చాం. వేడివేడి కప్పు కాఫీ చేతికి అందించినప్పుడే గాని సంతోషంతో ఇల్లాలివంక చూచేది. అది అందించేదాకా పరాయిదాన్నికిందే చలామణిగా మరి" అని ఆవిడ సణుగుడు.

ఇంట్లో ముందు లేచినవారు సామాన్యంగా రేడియో పెడుతూ వుంటారు. ఆ ధ్వనికి తక్కినవారు తట్టుకుని నిద్రన్నా పోవాలి లేదా లేచి కూర్చుని తలన్నాబాదుకోవాలి. "అంతా లేచిన తర్వాత పెట్టవచ్చుగా రేడియో. అప్పుడే ఏం తొందర వచ్చింది?" అని కేకలు.

"మీరంతా లేచేదాకా కార్యక్రమాలు ఆగిపోతాయా? అలా అయితే మీకోసం ఒక ప్రత్యేక రేడియో స్టేషన్ పెట్టించుకోవాలి. చక్కగా సుప్రభాతం వుంది .ఈ పాపపు చెవుల్లో పడకుండా చేసుకోమంటారా?" అని వారి వాదన.

"నీకు సుప్రభాతం. నాకు నిద్రాఘాతం" అని ఇంటాయన సణుగుడు.

"అలా అనకండి. మహా పాపం. కళ్ళుండవంటారు. చెంపలు వేసుకోండి" అని ఆవిడగారి సలహా.

"నిన్ను చేసుకున్నందుకు రోజూ వేసుకుంటూనే వున్నాను. ప్రత్యేకావసరాలేమీ వుండవిక."

"భర్త ఎప్పుడు నిద్రపోయాడు? ఎంత చాకిరీ చేశాడు? ఎంత అలసిపోయాడు? ఎన్ని గంటలు పడి నిద్రపోయాడు? ఎంత నిద్ర ఆయనకు అవసరం". అనే మీమాంసలేకుండా కాఫీ హోటల్లోలాగా ఇలా రేడియో పెట్టి చక్కా పోతే ఎలా బ్రతికేది? అందుకే మన పెద్దలు మొత్తుకొన్నారు. "పతి భక్తి తర్వాతనే తక్కిన భక్తి" అని. ఈ రోజుల్లో భర్తా, బట్లర్ ఒకటై పోయారు" అని ఆయనగారి విచార ప్రకటన.

భగవంతుని దయవల్ల మన రేడియోల్లో కొంచెం భక్తిరంజని, సూక్తి ముక్తావళి వగైరా కార్యక్రమాలన్నా వుంటాయి. బలవంతంగా చెవినపడ్డా కొంత హాయీ తృప్తీ కలిగిస్తున్నాయి. లేవడంతోనే యుద్ధవార్తలు, రాజకీయ సంక్షోభాలు ప్రారంభిస్తే ఇంకెలా వుంటుందో.

డా.హెచ్ అన్నాడు "మా యింట్లో క్లాక్ రేడియో వుంది. ఫలానా గంటకు ప్రసారం ప్రారంభం కావాలని ముల్లు తిప్పి వుంచితే ఆ సమయానికి రేడియో వినిపిస్తుంది. అది మంచి సదుపాయమే. కానీ ఒకప్పుడు అనుకోని దుస్సంఘటనలు వినవలసి వస్తూవుంటుంది. ఒకప్పుడు రేడియో ప్రారంభం కావడంతోనే ఫలానా నాయకుడు యుద్ధం తప్పదంటున్నాడు. సైన్యాన్ని సన్నద్ధం కావాలని హెచ్చరించాడు. శత్రువును హతమార్చడంతో ఎంతమాత్రం జాప్యం జరగకూడదన్నాడు" అంటూ వస్తుంది.

"ఒకప్పుడు ఎక్కడో మనకు తెలియని దూర ప్రాంతాంలో రైలు బోల్తా పడిందనీ, చాలామంది మరణించారనీ, కొందరు కొనవూపిరితో వున్నారనీ ఒక ఘోరవార్త వినవస్తుంది. హఠాత్తుగా ఆ వార్త వినడంతో మనస్సు ముద్ద కట్టుకుపోవడం, జీవితం మీద విరక్తి భావం కలగడం జరుగుతూ వుంటుంది",అన్నాడాయన.

చాలామంది ఉదయం కార్యక్రమాల్ని రేడియో టైము ద్వారా చెప్పడం జరుగుతూ వుంటుంది. "నేను వందేమాతరానికి ముందే లేస్తాను. ప్రతిరోజూ అంతే. ప్రసార విశేషాల్లో చంటి వెధవ లేచి వెంటపడతాడు. భక్తి రంజనిలో అత్తగారు మంచం మీద కాలు భూమి మీద పెడుతుంది. సూక్తిముక్తావళిలో పురిటికి వచ్చిన ఆడబడుచు ముక్తసరి పిలుపులు ప్రారంభిస్తుంది. తెలుగు వార్తల్లోగాని పాలమనిషి రాడు. సంగీత శిక్షణ అవుతుండగా అంట్లుతోమే అమ్మాయి వస్తుంది. ప్రసార సమాప్తి తర్వాతగానీ మా వారు సుషుప్తిలోనుంచి బయటపడరు" అంది.

నిద్రలో నుంచి జాగ్రదావస్థలోకి ఉరకడంలో ఎన్ని విశేషాలో, ఎన్ని వింతలో..!!

Post your comments